

బీచ్‌లో తెల్లవారింది.

సూర్యుడి కిరణాలు సముద్రం మీద పడి నీళ్ళు వెండి తీగెల్లా తళతళ మెరుస్తున్నాయి. ఇసుక రాత్రి మంచుకి చల్లబడి, ఇప్పుడు మళ్ళీ వేడెక్కుతూంది.

సముద్రపు అలలు తాకే చోటికి కొద్దిగజాల దూరంలో ఓ కుర్రవాడి శవం పడుకోబెట్టబడి వుంది. శరీరం పొడుగు, ప్రమాణాలు చూస్తే వాడికి పదేళ్ళ వయసని తెలుస్తుంది. నిక్కరు,చొక్కా కొత్త ఖరీదయినవే. పచ్చగా, సన్నగా గొప్పింటి బిడ్డలాగే కనిపిస్తున్నాడు. పాపం ముఖం మాత్రం ఆనవాళ్ళు కొంచెంకూడ తెలియకుండా చితక్కొట్టబడి, నజ్జుఅయి వుంది. అలా చూస్తే కళ్ళు తిరిగిపోయేట్టుంది ఎంత గుండెనిబ్బరం గలవాడికైనా !

ఎంత సేపటినించి ఆ శవం అక్కడ వున్నదో తెలీదు గాని, గతరాత్రి దాదాపు పదిగంటల వరకూ బీచ్‌లో కూచుని గడిపిన కొందరు మాత్రం అప్పటికి ఆ ప్రాంతంలో ఈ శవం లేదని ఘంటాపథంగా చెబుతున్నారు. ఆ దగ్గరలో వుండి ఇప్పుడు ఈ దారుణ దృశ్యాన్ని చూడడానికి వచ్చినవాళ్ళు అలా చెబుతున్నారు. "ఎంతఘోరం! నిన్న రాత్రి ఏం లేదండీ! మరి ... ఏ అర్థరాత్రో ఎవరో, ఈ శవాన్ని తెచ్చి పడేసి వుండాలి. అంతే! అలాగే జరిగి వుంటుంది.

"రామ రామ!" కొందరు విలవిల లాడారు. "చూడలేకపోతున్నాం సార్, ఇంత ఘోరంగా చంపడానికి వాళ్ళకి చేతులెలా వచ్చాయో! పాపం! పసివాడు!

# మినీకథ!

పోనీ మరో పెద్దమనిషో, ఆడదో అయితే ఏవో కారణాలు వుండుంటాయనుకోవచ్చు. వీడేంచేశాడు ఇంతచిన్న కుర్రాడు !"

క్రమంగా జనసమ్మర్దం పెరిగిందక్కడ. పోలీసులు వచ్చారు. అక్కడ వున్నవాళ్ళని ఆ శవం మొదట ఎవరు చూశారని, ఎన్నిగంటలైందని, అతని వివరాలు వాళ్ళల్లో ఎవరికయినా తెలుసునా? అని ఎన్నెన్నో ప్రశ్నలడిగి రాసుకున్నారు.

ఆవూరి పత్రికలవాళ్ళుకూడా వచ్చారు. ఫోటోలు తీసుకున్నారు ఏదో రాసుకున్నారు.

ఆ తర్వాత శవాన్ని 'పోస్టుమార్టమ్'కి పంపించారు.

జనం వెళ్ళిపోయారు. ఎవరి దార్న వాళ్ళు ఆ ఘోరాన్ని అనేక రకాలుగా చెప్పుకుని, వాపోతూ.

* * *

"డార్లింగ్ !"

మత్తుగా పిల్చిందిరాణి. ఇటు నించటు పొర్లి, వాళ్ళు విరుచుకుని.

"వూఁ..." దినేష్ నెమ్మదిగా పలికాడు. మంచానికి దగ్గరగా వున్న బల్లమీద వున్న సిగరెట్ పాకెట్ అందుకున్నాడు. ఓ సిగరెట్ తీసి, అగ్గిపుల్లగీసి అంటించుకుని, గుండెనిండా పొగ పీల్చి, తృప్తిగా వదలాడు.

రాణి, దినేష్ ఒకరిని ఒకరు ఆనుకుని వెల్లకిలా పడుకున్నారు. ఇద్దరి శరీరాల మీద బట్టలులేవు, నూలుపోగు కూడా. అలిసిపోయినట్టు వూపిరి వేగంగా వదులుతున్నారు.

"ఏం పిలిచావు?" అడిగాడు దినేష్.

"మన ప్రయాణం ?"

"తొందరగా వుందా ?"

# ఇది నిజం!

"కాక! ఇక్కడేం బాగుంది? ప్రతినిముషం జడిసిఛస్తూ..."

దినేష్ నవ్వాడు. "ఎందుకు జడవటం? మీ ఆయన లేడుగా ఇక్కడ?"

"ఇక్కడ లేకపోతేనేం? భూమ్మీద వున్నాడు గద? నా పీక మీదికి! నెలకోసారైనా తగలడుతూ..."

"వ్యాపారం గదా మరి?"

"పాడు వ్యాపారం! నెలకి ఇరవయి తొమ్మిదిరోజులు వ్యాపారంలోనే మునిగిపోతాడు. ఒక్క రోజు నన్ను ఏదో ఉద్ధరించేసినట్టు తయారౌతాడు."

"ఇది అసలాయనకి పెళ్ళాం అనిపిస్తే గదా? ఏదో వొస్తువు అంతే! వుందా? లేదా అని మాత్రం ఎప్పుడో చూసుకుందుకి వొస్తాడు! దినేష్! ఈ నరకం నా కొద్దింక!"

"నేనుండగా నరకం ఎలా అయింది డార్లింగ్?"

"నరకమే! ఆ గుంటవెధవొకడు మరో శత్రువు! నాకు!"

"డాళింగ్! నాకు తెలీకడుగుతాను...వాడు నీ కొడుకే?"

"ఆఁ...కొడుకే! నేనేం కోరుకోలే! వాణ్ని పుట్టమని! శత్రుత్వం సాధిస్తున్నాడు. కొంచెం కూడా ఫ్రీడమ్ లేదు నాకు!"

రాణి కోపంగా బుసకొట్టింది. దినేష్ ఆమెని చల్లార్చడానికి చేత్తో వొంటిని నిమిరాడు. గుండెల్ని...పొట్టని ... నిమురుతూ చేతివేళ్ళు ముందుకి పాకాయి. రాణి వివశత్వంతో అతణ్ణి పెనవేసుకు పోయింది.

తలుపు చప్పుడైంది. దబ్బదబ కొడుతుంటె ఇద్దరూ ఎడంగా జరిగారు. రాణి మండిపడుతూనే లేచింది. దినేష్ ఆమె చెయ్యి పట్టుకులాగాడు వెళ్లొద్దని. తలుపులు మరింత గట్టిగా చప్పుడయ్యాయి. "అమ్మా! అమ్మా!" అని పిలుపు అవతల్నించి.

రాణి దినేష్‌నించి విడిపించుకుని చీర చుట్టబెట్టుకుని తలుపులు తీసింది. దినేష్ బట్టలు తొడుక్కుని వుగ్రంగా చూశాడు లోపలికొచ్చిన రాణి కొడుకుని. ఆ అబ్బాయి "భయమేస్తోంది నాకక్కడ!" అంటూ ఏడ్చాడు.

"ఇక్కడే పడుంటాను!"

"చంపేస్తాను వెళ్ళుముందు"

"వుఁహు! వెళ్ళను! నాన్నే వెళ్ళమను!"

"నరికేస్తాను. నువ్వెవడ్రా? నన్ను పొమ్మనడానికి?" దినేష్ ఆ అబ్బాయిని లెంపకాయ కొట్టాడు.

"మంచిపని చేశావు!" రాణి దినేష్‌ని **అభినందించింది.**

చెంపదెబ్బ తినగానే ఆ అబ్బాయికి మనస్సులోంచి మంట వురికింది.

"వెధవా! మా నాన్న లేకుండా మా ఇంటికొచ్చి...సిగ్గులేదూ?" తల్లిమీద కోపాన్నికూడా వెళ్ళగ్రక్కేడు. రాణి కొట్టేసింది గట్టిగా. ఆ అబ్బాయి ఇద్దర్నీ తిడుతూ. ఏడుస్తుంటే రాణి మండిపడ్తూ అక్కడ టేబిలుమీదవున్న టేబిల్ లైట్ తీసి **అతని తలమీద** కొట్టింది. కొడుతూనే వుంది కసితో, ద్వేషంతో, పగతో ... దినేష్ వెతికి దుడ్డుకర్ర తెచ్చాడు ఇద్దరూ ఆ అబ్బాయిమీద పడి, విజృంభించారు. ముఖం ముద్దయింది. తర్వాత ఇద్దరూ వెళ్ళి చేతులు కడుక్కున్నారు. రాణి గరాజ్‌లోంచి కారు తీసింది. ఇద్దరూ శవాన్ని కార్లో పడేశారు.

కారు నెమ్మదిగా బీచ్ కేసి కదిలింది.

* * *

తరవాత కథ మీకు తెలిసిందే!

ఇది జరిగింది! ఇది నిజం! నమ్మండి!

# శివల జగన్నాధరావు